

"అమ్మా, ఫ్లఫీ!" అని ఒక్క గావుకేక వేసింది నీతా.

"ఉండవే, కాబేజీ కూర మాడిపోతోంది, ఇరవై నాలుగ్గంటలూ నీకు ఫ్లఫీ ధోరణే!" అంది సుజాత విసుగ్గా.

"తొందరగా రామ్మా! ఫ్లఫీ గిలగిలా కొట్టుకుంటోంది!" మళ్లీ ఆదుర్దాగా పిలిచింది నీతా.

స్టౌవ్ మంట తగ్గించి వచ్చింది సుజాత.

"ఫ్లఫీ! ... ఫ్లఫీ...!" అని ఏడుస్తోంది ఒళ్లో పెట్టుకుని నీతా.

సుజాత రాగానే నీతా ఒళ్లో ఒళ్లు విరుచుకుని, కాళ్లు చాచి, పంజా విప్పి, నాలికను కొద్దిగా బయటకు పెట్టి కళ్లు తెరుచుకునే ప్రాణం వదిలింది ఫ్లఫీ.

నీతా ఏడుపుకి అవధులు లేవు. సుజాత నీతాని గట్టిగా కౌగలించుకుని, ఒక చేత్తో చచ్చిపోయిన ఫ్లఫీ శరీరం నిమురుతోంది. అనుకోకుండా అశ్రువులు రాలాయి సుజాత కళ్లల్లోంచి కూడా.

టొరంటో డౌన్ టౌన్. సాయంత్రం నాలుగు గంటలు కావస్తోంది. రష్ అవర్ మొదలైంది. యూనివర్సిటీలో రిటైర్ అయి కాలక్షేపం కోసం కొత్తగా రియల్ ఎస్టేట్‌లో చేరిన సుందరానికి నాలుగున్నరకి డౌన్ టౌన్‌లో బిజినెస్ ప్రాపర్టీ షోయింగ్ ఉంది. కస్టమర్‌ని పికప్‌చేసి యాంగ్ స్ట్రీట్ మీద కారు ఎక్కడ పార్కు చేయాలా అన్న ఆలోచన....

ఉన్నట్లుండి పేజర్ మోగింది. పేజర్ ఆపి, మెసేజ్ చూసుకున్నాడు సుందరం. "కాల్ మిసెస్ సుందరం ఇమిడియట్లీ!" అని ఉంది.

'ఓ భగవాన్! ఇరవై నిముషాలు కూడా కాలేదే ఇంటి నుంచి బయలుదేరి, ఇంతలో ఏమైంది? సుజాతకి కాని మళ్లీ గుండె నొప్పి రాలేదు కదా! లేక నీతా టీ చెయడానికి పెట్టిన వేడినీళ్లేమైనా ఒంటిమీద పోసుకోలేదు కదా!' ఇటువంటి ఆలోచనలతో కారుని రోడ్డువక్కకి లాగి ఏ పబ్లిక్ ఫోన్ బూత్‌కో వెళ్లి ఫోను చేయాలనుకుంటున్న సమయంలో తన కార్‌ఫోన్ జ్ఞాపకమొచ్చింది. ఆ ఫోను సుందరం వేరే ఊళ్లో పనిచేస్తున్నప్పుడు, తల్లీ కూతుళ్లిద్దరూ కారులో వెళ్తున్నప్పుడు దారిలో ఏ అవాంతరమైనా జరిగితే కారు ఫోనుతో కనీసం సి.ఏ.ఏ.వాడినైనా పిలవచ్చునన్న ఉద్దేశంతో పెట్టించిన ఫోను అది. ప్రస్తుతం ఉపయోగపడింది సుందరానికి.

కారులో అయితే ఫోనుంది కానీ, సుందరం ఎప్పుడూ ఉపయోగించలేదు. ఎలాగో కారుని మెల్లిగా నడుపుతూ కాస్త శ్రమపడి జయప్రదంగా ఫోను చేశాడు ఇంటికి.

"హల్లో!" అంది గద్గద స్వరంతో సుజాత.

"ఏమైంది, అంత అర్జంటుగా ఫోను చెయ్యమన్నావు?" ఆదుర్దాగా అడిగాడు సుందరం.

"ఫ్లఫీ చచ్చిపోయిందండీ! నీతా ఒళ్లో ప్రాణం వదిలేసింది. నాకేం చేయాలో తోచటంలేదు!" అంది సుజాత.

"వెటర్నరీ డాక్టర్‌కి ఫోన్ చేశావా?"

"చేశాను. వెంటనే 'బాడీ'ని తీసుకురమ్మన్నాడు డాక్టరు. కానీ, మీరు రాగలరా?" అంది సుజాత.

"మరో పది నిముషాల్లో కస్టమర్‌ని మీట్ అవ్వాలి. చివరి క్షణంలో అపాయింట్‌మెంట్ కాన్సిల్

# పాపం ఫ్లఫీ

## కె. సుదర్శనరాజు

చేయడానికి వీల్లేదు. ఏ టాక్సీలోనో వెళ్లండి! లేదా, కమలగార్ని పిల్చి చెప్పు, 'రైడ్' ఇస్తారేమో!" అని రిసీవర్ పెట్టేశాడు.

ఈలోగా ఈ 'ఇండియన్'గాడి క్కూడా కారు ఫోనా అని చురచుర చూస్తూ కారు నడిపే తెల్ల తొక్క మనుషులు కొందరు. "తొందరగా నడపరా చచ్చూ!" అని హారన్ కొట్టేవాళ్లు మరి కొందరు. ఈలోగా మెర్సిడస్‌లు నడుపుతూ తన కారుని ఆల్‌మోస్ట్ డాష్ ఇచ్చినంత పని చేసిన హాంకాంగ్ చింకీలు. మొత్తానికి గమ్యం చేరుకున్నాడు సుందరం. షోయింగ్ చక్కగానే జరిగింది. ఇలా ఎన్ని షోయింగ్‌లు జరగాలో ఒక్క ఆఫర్‌మీద సంతకం పెట్టడానికి. కష్టే ఫలే అన్నారు కదా! తిరిగి రష్ అవర్‌లో డాన్‌వాలీ పార్క్ వే మీద ఈదుకుంటూ ఇంటికి చేరాడు సుందరం.

తలుపు తెరిచేసరికి 'మ్యావ్' అంటూ తన కాళ్ల చుట్టూ తిరిగే ఫ్లఫీ రాలేదు. అప్పుడే వెలితి కనిపిస్తోంది ఇంట్లో.

"నేను వెళ్లేటప్పుడు చెంగుచెంగున గెంతులేస్తోంది కదా! అంతలోకి ఎలా చచ్చిపోయింది?" అడిగాడు సుందరం.

"ఉన్నట్లుండి మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చింది. పోయింది, పాపం!"

"మరి బాడీ ఉందా ఇంట్లో?" అడిగాడు సుందరం ఆఖరుసారిగా చూద్దామని.

"లేదు, ఫోను చేయగానే కమలగారు వచ్చి మమ్మల్ని తీసుకెళ్తే వెటర్నరీ హాస్పిటల్‌లో అప్పగించాము. చచ్చిపోయినా దాని మొఖం ఎంత కళగా ఉందండీ! క్రిమేషన్‌కి 32 డాలర్లు తీసుకున్నారు. మనకీ దానికీ ఋణం తీరిపోయింది."

విచారంగా కూర్చున్నారు సుందరం కుటుంబంలో ముగ్గురూను. నీతాని దగ్గరగా తీసుకుని ఓదార్చాడు సుందరం.

"సాయిబాబా విభూతి పెట్టావా ఫ్లఫీ బాడీకి?" అడిగాడు సుందరం. ఆ విభూతి పెడితేనే ఫ్లఫీ స్వర్గానికి వెళ్లేటట్టు.

"అయ్యో తోచలేదండీ! కానీ, పోయిన వెంటనే దాని ఆత్మకి శాంతిని చేకూర్చమని ప్రార్థించాను!" అంది సుజాత.

దాదాపు పద్నాలుగేళ్లైంది ఫ్లఫీ వచ్చి సుందరంగారింటికి. యూనివర్సిటీలో ఐదేళ్లపాటు ఖాయంగా ఉద్యోగం ఉంటుందన్న సంగతి తెలియగానే ధైర్యం చేసి రెండంతస్తుల డిటాచ్డ్ హౌస్ కొన్నాడు సుందరం. సుజాత పనిచేస్తున్న ఆఫీసుకి ఆరు నిమిషాలు డ్రైవింగ్. ఒక రోజు ఇంటికొచ్చేసరికి తల్లీ కూతుళ్లు చిన్న పిల్లికూనని ఒళ్లో పెట్టుకుని ఆడుతున్నారు.

ఇంట్లోకి అడుగుపెడుతూనే "ఇదెక్కడనుంచొచ్చింది?" అన్నాడు సుందరం పిల్లి కూననుద్దేశించి.

"నీతా స్నేహితురాలు రీటా ఇంట్లో పిల్లి నాలుగు కూనల్ని ఈనిందట నెల్లాళ్ల క్రితం. అందరికీ తలొకటి ఇస్తూంటే మేము కూడా ఒకటి తెచ్చాము!" అంది సుజాత.

"ఎంతకి కొన్నారు?" ఏ రెండు వందల డాలర్లో తగలేసి ఉంటారులే అన్న ధోరణిలో ప్రశ్నించాడు సుందరం.

"ఫ్రీగా ఇచ్చారండీ! నీతా ఫ్రెండే కదా రీటా!"

"మరి ఇది కార్పెట్ మీద మూత్రం, పెంట వేసి ఇల్లు తగలేస్తుందా?" మరో ప్రశ్న ఈ పీడని ఎక్కడ తగిలించుకున్నారో అనుకుంటూ.

"అదేమీ చెయ్యదుట. పుట్టిన మూడు వారాల్లోగానే తల్లి పిల్లి, కూనలకి శిక్షణ ఇస్తుందట!" అంది అటువంటి బాధేమీ లేదన్నట్లుగా సుజాత.

"ఏమైనా సరే, ఈ పిల్లైనా ఉండాలి, లేదా నేనైనా ఉండాలి ఈ ఇంట్లో!" అన్నాడు సుందరం గర్జిస్తూ.

"నాలుగు రోజులు చూసి అది సరిగా నడుచుకోకపోతే మళ్లీ రీటాకి ఇచ్చేద్దాంలెండి! ఈ నాలుగు రోజుల్లోనూ నీతాకి మోజు కూడా కాస్త తీరుతుంది!" అంది సుజాత ఈ నాలుగు రోజుల్లోనూ సుందరం మనసు మారకపోతుందా అనే ధైర్యంతో.

పిల్లికూన సుందరంవైపు చూస్తూ, "మ్యావ్!" అంది. సుందరం కూడా "మ్యావ్!" అన్నాడు. ఇలా రెండు మూడు సార్లయిన తర్వాత గబుక్కున సోఫామీదికి ఎగిరి మెల్లిగా సుందరం ఒళ్లో చేరింది. సుందరం కూనని మెల్లగా నిమిరాడు.

తెల్లటి రంగులో గోధుమవర్ణం, నలుపు కలిసిన మచ్చలు. ముఖంలో ఎంతో కళ. రెండున్నర అంగుళాల పొడవైన బొచ్చు. "అయితే ఏం పేరు పెడదాం?" అన్నాడు సుందరం.

"ఆ ఛాయిస్ మనకి లేదు. నీతా అప్పుడే 'ఫ్లఫీ' అని నామకరణం చేసేసింది!" అంది సుజాత.

నీతాకి ఆరు సంవత్సరాల వయస్సు. అయినా పిల్లి కూన బొచ్చు మెత్తగా ఉండడంతో ఫ్లఫీ అని పేరు పెట్టింది.

అరగంట కాగానే, "ఏమండీ, మనం బజారుకెళ్లాలి!" అంది సుజాత.

"ఎందుకు? నిన్ననే కదా వారానికి సరిపడ 'గ్రోసరీ' కొన్నాము!" అన్నాడు సుందరం.

"పిల్లికి కావలసినవి కొన్ని వస్తువులు కొనాలి!" అంది సుజాత.

సరే అని ముగ్గురూ బయలుదేరారు. పెట్ షాపుకెళ్లి నాలుగువక్కలా చూస్తూ ఉంటే, "మే ఐ హెల్ప్ యు?" అంటూ వచ్చాడో యువకుడు.

మా ఇంట్లోకి ఒక 'కిటెన్'ని తెచ్చామని, దానికి ఏం కొనాలో తెలియదని, సలహా ఇమ్మని అడిగారు సుందరం, సుజాత.

పాల్ సలహా ప్రారంభించాడు. "కిటెన్‌కి ముఖ్యం ఫుడ్ అండ్ వాటర్. సొ యు నీడ్ వెట్ ఫుడ్, పెండర్ విపెల్స్, డ్రై ఫుడ్. ఫుడ్ వేసేందుకు ప్లాస్టిక్ బౌల్స్, లిట్టర్ బాక్స్, లిట్టర్! ఆ పిల్లిపిల్ల ఆడుకునేందుకు గంట ఉన్న బాల్, కీ ఇస్తే పరుగెత్తే చుంచు!"

ఇవన్నీ కొని బిల్లు ఎంతైందంటే నలభై మూడు డాలర్లన్నాడు. జేబులో ఉన్న యాభై డాలర్ల నోటిచ్చాడు సుందరం.

ఆ నోటు తీసుకుంటూ, "డు యూ హావ్ ఎ పెట్ కారియర్?" అన్నాడు పాల్.

"వాట్ ఫర్?" అన్నాడు సుందరం.

"హౌ డు యు పిక్ హర్ టు వెట్?" అన్నాడు పాల్.

సరే, అది కూడా ఇమ్మన్నాడు సుందరం. బిల్లు యాభై ఎనిమిది డాలర్లయింది. ప్లాస్టిక్ కార్డు శరణ్యమైంది.

పిల్లి కూన వచ్చిన రోజే అర్ధనూటపదహార్లు కట్నమర్పించామన్నాడు సుందరం.

"ఫుడ్డే కదాండీ కొనేది ఇకమీదట? ఆ పిల్లముండ ఎంత తింటుంది కనుక?" అంది సుజాత.

ఇంటికి రాగానే బేస్‌మెంట్‌లో ఒక మూలగా లిట్టర్ బాక్స్ పెట్టి, లిట్టర్ వేసి ఫ్లఫీని తీసుకెళ్లి ఒకమారు అందులో కూర్చోపెట్టాడు సుందరం. ఒక్కసారి చెప్పిన విషయం ఏకసంథాగ్రాహిలా నేర్చేసుకుని పోయినదాకా ఆ నియమం పాటించింది.

రాత్రి పడుకోబోయేముందు ఫ్లఫీని ఎక్కడ

పడుకోబెట్టాలా అని తర్జనభర్జన.

"నా బెడ్ మీదే పడుకుంటుంది!" అంది నీతా.

"వద్దమ్మా, జెర్మ్స్ ఉంటాయి!" అన్నారు తల్లిదండ్రులు.

టి.వి. కమర్షియల్స్ పుణ్యమా అని పిల్లికి ఒక బుట్టలో చక్కటి దిండు పరుపుగా వేసి, మంచి దుప్పటి వేసి పడుకోబెట్టారు సుజాత, సుందరం.

పొద్దుటే లేచి చూస్తే ఫ్లఫీ నీతా పక్కలోనే ఉంది. నీతా తెచ్చి పడుకోబెట్టుకుందో, లేక ఫ్లఫీయే వెళ్లి నీతా దగ్గర పడుకుందో తెలియదు.

బేస్‌మెంట్‌కి వెళ్లి చూస్తే లిట్టర్‌బాక్స్‌లో పెంట చాలానే ఉంది. పిట్టకొంచెం కూత ఘనం అన్న సామెత జ్ఞాపకమొచ్చింది. మరి ఏం చేయాలో తోచలేదు సుందరానికి. టొరంటో పార్కుల్లో 'స్కూప్ అండ్ స్వూప్' అన్న సైన్‌బోర్డులు చూడటం, కుక్కల్ని నడకకు తీసుకెళ్లే సుందరనారీమణులు .... ఒక చిన్న ప్లాస్టిక్ బాగ్ మోసుకెళ్లడం చూసి తను కూడా అదే పాటించాలనుకున్నాడు సుందరం. జంతికలు తీసే చిల్లులు గరిటనుపయోగించి లిట్టర్‌ను ప్లాస్టిక్ సంచీలో వేసి గార్బేజ్‌లో ఉంచాడు. గార్బేజ్ కలక్టర్ వారానికోమారే రావడం వల్ల రోజుకి రెండు సంచుల చొప్పున వారానికి 14 సంచులు గార్బేజ్‌లో వేసి గరాజ్‌లో ఉంచితే, కారు తీయడానికని గరాజ్ తలుపు తీయగానే గుప్పుని వచ్చే గబ్బుకంపు వల్ల ముక్కు మూసుకుని "వెధవ పిల్లి... వెధవ పిల్లి!" అని తిట్టుకునేవాడు సుందరం.

ఆ వీకెండ్‌లో పక్కింట్లో ఉన్న ఎస్టోనియన్ లేడీ కాట్ ఓనరు 'ఐనా'ని సిగ్గువిడిచి "కాట్‌షిట్‌ని ఏం చెయ్యాలి?" అని అడిగారు సుందరం దంపతులు.

"పుట్ ఇన్ ది టాయిలెట్ అండ్ ఫ్లష్!" అంది ఐనా.రెండు పిహెచ్.డి.లు ఉండి ఈమాత్రం సింపుల్ థింగ్ తోచలేదే అనిపించింది. వాట్ ఎ గ్రేట్ రిలీఫ్?

రాత్రింబవళ్లు నీతాకి ఫ్లఫీయే ధ్యాస. స్కూల్లో ఉన్నప్పుడు ఏం చేసేదో?

"మూడు నెలలవగానే స్పేడ్ చేయించాలి, లేకపోతే మీ ఇంటినిండా పిల్లులే!" అంది ఐనా.

ఐనా చెప్పిన ప్రకారం తు.చ. తప్పకుండా మూడు నెలలు కాగానే స్పేడ్ చేయించారు. బిల్లు 160 డాలర్లు. యాంటీ రేబిస్ ఇనాక్యులేషన్, ఫ్లీ కాలర్, కాట్ పౌడరు మరో యాభై డాలర్లు. ఏ చొక్కా వేసుకుంటే పోదులే అని పాతిక డాలర్ల చొక్కా బదులు పదకొండు డాలర్ల చొక్కా వేసుకుని పొదుపుగా గడిపే సుందరానికి కోపమొచ్చింది.

"ఈ పిల్లిముండకి ఇంత ఖర్చా? ఇక్కడనుంచి పిల్లి ఖర్చంతా నువ్వే చూసుకో! నువ్వూ సంపాదిస్తున్నావుగా!" అన్నాడు సుజాతనుద్దేశించి.

"స్పేడింగ్ లైఫ్‌లో ఒకసారేనండీ! దానికి అంత రాద్ధాంతం చేస్తారేమిటి?" అంది సుజాత.

ఆ రాత్రికి వెటర్నరీ హాస్పిటల్‌లో ఉంచి మర్నాడు తీసుకొచ్చారు ఫ్లఫీని. నొప్పి మూలాననుకుంటాను కొంచెం కుంటుతూ నడిచింది.

ఇక ఫ్లఫీ బయట తిరిగినా భయంలేదు. ఎంతమంది టామ్‌బాయిస్‌తో తిరిగినా ఫర్వాలేదు. కానీ ఫ్లఫీకి నెల ఖర్చు నలభై డాలర్లు. నీతా సంతోషం నలభై డాలర్లు వేరే విధంగా ఖర్చు పెడితే రాదు కదా!

ఒకనాడు పెరట్లో గట్టిగా మ్యావ్ మంటోంది. ఏమిటా అని చూస్తే తుప్పలో ఫ్లఫీ మ్యావ్ తప్పితే ఫ్లఫీ కనబడటంలేదు. "ఫ్లఫీ!" అని కేక వేస్తే ఇంట్లోకి ఒక్క దూకులో వచ్చింది.

"అబ్బా, భరించలేని కంపు!" 'స్కంక్'తో పోట్లాడింది. స్కంక్ దాని తడాఖా చూపించింది. ఇల్లంతా ఎక్కడ కంపు కొడుతుందోనని ధైర్యం చేసి పెట్ కారియర్‌లో పెట్టి గొళ్లెం వేసింది సుజాత.

ఆ రోజు శనివారం. ఉదయమే టెన్నిస్ ఆడి వచ్చి, హాట్ షవర్ తీసుకుని, టీ.వీ. ఆన్ చేసి సోఫాలో చతికిలపడ్డాడు సుందరం.

"ఏమండీ, మీరు తొందరగా వెళ్లి రెండు టమాటో జ్యూస్ డబ్బాలు, రెండు జతల రబ్బరు గ్లౌస్ మీకో జత, నా కో జత పట్టుకురండి! లేకపోతే ఈ కంపు భరించలేము!" అంది సుజాత.

## జీరోఇన్

'కర్తవ్యం' చిత్రం దగ్గర్నుండీ అన్నీ "మగరాయుడి" టైపు పాత్రలే పోషిస్తున్న విజయశాంతిని ఈమధ్య కలిసి మళ్లీ మిమ్మల్ని చీరకట్టు పాత్రల్లో చూసే అవకాశం లేదా? అనడిగితే, "నేను చీరకట్టుకునే పాత్రల్లో చేయనని ఎప్పుడూ చెప్పలేదే" అంది చిరాగ్గా. మళ్లీ ఏమనుకుందో, ఏమో కాస్సేపాగి, "హీరోలసరసన నటించాలని, డాన్సులు చేయాలని నాకూ ఉంది. కాని, ఎందుకు వాళ్లు మొగ్గు చూపడంలేదో నాకే అర్థం కావటంలేదు. దీనికి సమాధానం వాళ్లే చెబితే బావుంటుంది" అంది.



అయినా, విజయశాంతి హీరోయిన్‌లా కాకుండా, హీరోలా మారిపోయాక ఆమెతో కలిసి ఎలా నటిస్తారు మన హీరోలు?

వి.

వేరే దిక్కు లేక అనుకోని ఖర్చుకి విసుక్కుంటూ సామగ్రి తెచ్చి పడేశాడు సుందరం.

"మీరు గ్లౌస్ వేసుకుని, డబ్బాలు తెరిచి ఇవ్వండి. లాండ్రీ వాష్ బేసిన్‌లో ఫ్లఫీకి టమాటో రసంతో రుద్ది స్నానం చేయించాలి!" అంది సుజాత.

పిల్లి పెంపకంతోబాటు జనరల్ నాలెడ్జ్ కూడా పెరిగిపోతోంది సుందరానికి. స్కంక్ కంపుకి విరుగుడు టమాటో రసమని తెలియడం అదే మొదటిసారి. ఫ్లఫీ తనింట్లో ఒక పిల్లలాగా ఒప్పుకుందుకు దాదాపు సంవత్సరం పట్టింది సుందరానికి.

నీతాతోపాటే ఫ్లఫీ కూడా పెరుగుతూ వచ్చింది. నీతాకి ఒంట్లో బాగుండకపోతే తనకి అర్థమైనట్లు నీతా సోఫా దగ్గరే కూర్చునేది. దానికి మనిషి భాష వచ్చి ఉంటే ఓదార్చేదేమో! సుజాత పూజ చేస్తున్నప్పుడు అగరుబత్తి పొగ చూస్తూ, ఆ పొగ తిరిగిన మాదిరే తన తలను కూడా తిప్పుతూ చూసేది. ఎవరైనా ఇంటికి వస్తే ఫ్లఫీ వచ్చి వాళ్ల పక్కకు వచ్చి తోకెత్తి రాసుకు తిరిగి వాళ్ల పక్కనే కూర్చునేది. చాలామంది ఫ్లఫీని చూసి "ఎంత కళ ఉందండీ దీని ముఖంలో!" అనేవారు. అటువంటి ఫ్లఫీ దూరమైపోయింది.

నీతా యూనివర్సిటీలో చేరింది. ఇరవై సంవత్సరాల వయస్సు. ఫ్లఫీకి పద్నాలుగుసంవత్సరాలు. ఒక పిల్లి సంవత్సరం ఏడు మానవ సంవత్సరాలకి సమానమట. అంటే దానికి తొంభై ఎనిమిది సంవత్సరాలు.

పెరట్లో ఎలకల్ని పట్టి సుందరానికి చూపించాలని గర్వంగా ఇటూ అటూ తిరిగేది. అంతేకానీ తినేది కాదు. రెడీ మేడ్ కేన్డ్ ఫుడ్ అలవాటైన ఫ్లఫీకి ఎలుకల పచ్చి మాంసం నచ్చేది కాదేమో!

నీతా ఎనిమిదవ తరగతిలో ఉండగా ఒకనాడు బేస్‌మెంట్‌లో అట్టపెట్టెలో ఫ్లఫీని కూర్చోపెట్టి, పెట్టెకి తాడుకట్టి ఈ చివరనుంచి ఆ చివరకి, ఆ చివర నుంచి ఈ చివరికి లాగుతుంటే ఎంతో ఆనందిస్తున్నట్లుగా కూర్చుంది. నీతా కేరింతలు కొడుతూ ఆడుకుంటున్న సంతోషానికి సుందరం , సుజాత కూడా సంతోషించారు. అటువంటి సంతోషాన్నిచ్చి ఫ్లఫీ అకస్మాత్తుగా వెళ్లిపోయింది. బయటకు వెళ్లి పిల్లిని "ఫ్లఫీ!" అని ఒక్క కేక వేస్తే తారాజువ్వలాగా ఏ తుప్పల్లోంచో చెంగున గంతులేస్తూ వచ్చేది. అటువంటి ఫ్లఫీ దూరమైపోయింది.

మొదట్లో చీదరించుకున్న సుందరానికి ఫ్లఫీ డ్యూటీలన్నీ దినచర్యలో భాగమైపోయాయి. మేడమీద నుంచి దిగి వస్తూంటే మెట్లకింద నుండి

"మ్యావ్!" అంటూ గ్రీట్ చేసేది. దానికి తిండి పెట్టేదాకా తన కాళ్ల చుట్టూరా తిరిగేది. రిఫ్రిజిరేటర్ తలుపు తెరవగానే తనకోసమే తలుపు తెరిచినట్లుగా పరుగెత్తుకొచ్చి తోకెత్తి "మ్యావ్!" అనేది. దాని ఆశ చూసి సుందరం, "తాగు పిచ్చిముండా!" అంటూ పాలు ఫ్లఫీ బౌల్‌లో పోసేవాడు. ఫ్లఫీ పోవడంతో చేతులు విరగ్గొట్టినట్లయింది సుందరానికి. ఏమిటో చాలా పని తగ్గినట్లయింది. జీవితంలో జంతువులతో కానీ, మనుషులతో కానీ ఇంత ఎటాచ్‌మెంట్ డెవలప్ చేసుకోకూడదనుకున్నాడు.

ఒకనాడు ఉన్నట్లుండి బయటకు వెళ్లిన ఫ్లఫీ తిరిగి రాలేదు. ఏ కారు కిందో పడి చచ్చిపోయిందనుకున్నాడు. హ్యూమన్ సొసైటీకి ఫోను చేసి ఫ్లఫీ వివరాలు చెప్తే, వాళ్లకి అటువంటి రిపోర్టేమీ రాలేదన్నారు. 'మిస్సింగ్ కేట్' అని రాసి, కాపీలు మూడు వీధులదాకా పంచిపెట్టారు. లాభం లేకపోయింది. దాదాపు ఇరవై నాలుగ్గంటలు గడిచిపోయింది. రాలేదు. మర్నాడు నీతాకి ఇంగ్లీషు పరీక్ష. "డాడీ, ఐ వాంట్ ఫ్లఫీ!" అని రాగాలు తీసింది.

"అమ్మా, నీతా! నేనొక పని చెప్తాను, చేస్తావా?" అన్నాడు సుందరం కాస్త దేవుడి మీద గురి కుదర్చడానికి.

"ఏం చెయ్యమంటే అది చేస్తాను!" అంది నీతా.

"అయితే దేవుడి గదిలోకి వెళ్లి, మూడు నిముషాలపాటు సిన్సియర్‌గా ప్రార్థించు!" అన్నాడు.

"ఫ్లఫీ వస్తుందా?" అని అడిగింది ఆదుర్దాగా నీతా.

"నేను చెప్పినట్లు చెయ్యి, రాకపోతే అప్పుడడుగు!" అన్నాడు సుందరం. పైకి గంభీరంగా అన్నాడు కానీ, తనకీ లోపల సందేహమే.

నీతా వెళ్లింది ప్రార్థించడానికి. ఈలోగా సుందరం స్వగతంలో ... అయిదు నిముషాల తర్వాత వచ్చింది నీతా "ఏదీ నా ఫ్లఫీ?" అంటూ.

"ఇప్పుడే కదా ప్రార్థించావు. దేవుడికి నీ మెసేజ్ అందాలి. దేవుడు చాలా బిజీగా ఉంటాడు. కాస్త గడువు ఇయ్యి. ఒక్క అరగంటలో వస్తుంది!" అని వివరించాడు సుందరం.

ఈలోగా తన మనసులో మాత్రం ప్రార్థన జరుపుతూనే ఉన్నాడు.

పావుగంట అయ్యేసరికి ఆశ్చర్యం! "మ్యావ్!" అంటూ ఫ్లఫీ పెరటి దోవలోంచి వచ్చింది. ఈ పిల్లి తిరిగి ఇరవై నాలుగ్గంటల తర్వాత ఎలా వచ్చింది? ఏ పక్కవాళ్ల గరాజ్‌లోనో దూరపడితే వారు చూసుకోకుండా తలుపు వేసేస్తే అక్కడే కూర్చుని ఉండవచ్చు. ఏది ఏమైనా తన ప్రార్థన సమయానికి టైమ్ కలిసొచ్చింది. తన పరువు దక్కింది.

ఒకనాడు ఫ్లఫీ ఒళ్లు తడుముతుంటే కొన్ని కొన్నిచోట్ల బొచ్చు లేకుండా నున్నగా ఉంది. వారంరోజులలోగా శరీరం మీద చాలా బొచ్చు రాలిపోయి ఈకలు పీకిన కోడిలాగా చాలా అసహ్యంగా కనపడింది. 'అయ్యో, ఇలా అయిపోతోందేమిటి?' అని బాధనిపించింది సుందరం కుటుంబానికి. వచ్చేపోయే స్నేహితులు దాన్ని చూసి పిల్లిమీద దయతల్చినట్లుగా "పుట్ హర్ టు స్లీప్!" అని సలహాలిచ్చేవారు. అప్పుడు తెలిసింది సుందరానికి ఆంగ్లభాషలో ఉన్న యుక్తి. ఎంత కుయుక్తి. 'పుట్ హర్ టు స్లీప్' అంటే శాశ్వత నిద్రకి పంపమని. మనింట్లో పెరిగే పిల్లకి ఒంటిమీద చిముడు కానీ, బొల్లికానీ వచ్చినంత మాత్రాన వాళ్లని చంపేస్తామా? ఆవులని, మేకలను పెంచి వాటి మాంసంకోసం ప్రజలు ఎలా చంపగలరా అన్న సందేహం బుర్రలో దొలిచేస్తోంది సుందరానికి.

సుజాత, సుందరాలకి ససేమిరా అటువంటి సలహాలవసరం లేదు. వెటర్నరీ డాక్టరుచేత పరీక్ష చేయిస్తే ఫ్లఫీకి థైరాయిడ్ సరిగా పనిచేయటంలేదని, ప్రతివారం రక్తపరీక్ష చేస్తూ మందుల డోసు మార్చాలని, ప్రతిసారి అరవై డాలర్లు అవుతుందని చెప్పాడు. ఇన్నాళ్లు పెంచిన ఫ్లఫీని చూస్తూ వదలబుద్ధి కాలేదు. దాదాపు అయిదు వందల డాలర్లు ఖర్చుపెట్టి ట్రీట్‌మెంట్ చేయించారు. బొచ్చు రాలిన ప్రదేశాలలో కొత్త బొచ్చు వచ్చింది.

దాని ఆటలు, దాని 'మ్యావు'లు .... అనుభవించినవారికే తెలుస్తుంది ఆనందం.

"ఈ ఇంట్లో పిల్లైనా ఉండాలి, నేనైనా ఉండాలి!" అన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి సుందరానికి. సుందరమే నెగ్గాడు చివరికి. ఫ్లఫీయే వెళ్లిపోయింది. తను మొదట్లో అన్న మాటలే జ్ఞాపకమొచ్చి రెండు కన్నీళ్లు రాల్చాడు. పిచ్చికమీద బ్రహ్మాస్త్రం అనే సామెత! పిల్లితో తనకి పోటీ ఏమిటనుకుని చిన్నబుచ్చుకున్నాడు. తాను ఇంట్లో లేనప్పుడే వచ్చింది తమ ఇంటికి. తను ఇంట్లో లేని సమయం చూసి వెళ్లిపోయింది. ఫ్లఫీ పోవడం సుందరం కుటుంబానికి తీరని లోటు. చచ్చి ఏ లోకంలో ఉందో పాపం ఫ్లఫీ!

రోజులు క్రమంగా దొర్లిపోయాయి. దాదాపు ఆరునెలలయింది. రోజుకి రెండుసార్లయినా 'ఐ వాంట్ మై ఫ్లఫీ' అంటుంది నీతా ఫ్లఫీ ఫొటో చూస్తూ.

"అస్తమానమూ అలా తలుస్తే ఫ్లఫీ ఆత్మ ఈ ఇంటిపట్టునే వేలాడుతుంది, నిజంగా నీకు ఫ్లఫీ మీద ప్రేమ ఉంటే దానికి మంచి పునర్జన్మ రావాలని ప్రార్థించు!" అనేవాడు సుందరం కూతురితో... ఫ్లఫీని ఎలాగైనా మరిపించాలని.

ఆరోజు వరలక్ష్మి వ్రతం. సుజాత పూజకి ఉపక్రమిస్తూ నీతాని కూడా రమ్మంది. ఫ్లఫీ ఫొటో పట్టుకొచ్చి వరలక్ష్మి దేవత పక్కన పెట్టింది నీతా. పూజ అయింది. సుందరం స్నేహితుడు మూర్తిని భోజనానికి పిలిచాడు. భోజనాలయ్యాయి. ప్రతిరోజూ వాకింగ్‌కి వెళ్లినట్లే సుందరం, మూర్తి వాకింగ్‌కి వెళ్లారు.

ఇద్దరూ పిచ్చాపాటి మాట్లాడుకుంటూ చాలా దూరం నడిచారు. ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమై చిన్న చిన్న చినుకులు ప్రారంభమయ్యాయి. ఆరోజు ఫోర్‌కాస్ట్‌లో షవర్స్ అని కూడా ఎక్కడా విన్నట్లు లేదు. చిన్న చినుకులు పెద్దవైనాయి. అరకిలోమీటరు దూరంలో తల దాచుకునేందుకు ఏ కార్నర్‌షాప్ కానీ, ఇళ్లు కానీ లేవు. బాగా తడిసి ముద్దయ్యారు. మేఘాలతో బాగా చీకటి పడినట్లయింది.

తడిసి ముద్దయి ఇంటికొచ్చి తలుపు తియ్యమని దబదబా బాదుతున్నాడు సుందరం. తన కాలికి ఏదో మెత్తగా తగిలింది. తీరా చూస్తే పిల్లి కూన! గజగజ వణికిపోతోంది. సుందరాన్ని చూసి, "మ్యావ్!" అంది. ఫ్లఫీ మొదట్లో వచ్చినప్పుడెలా ఉందో, ఇప్పుడీ పిల్లి కూన అలాగే ఉంది.

నీతా తలుపు తీయగానే సుందరం, మూర్తిలకంటే ముందే అది దూరింది. దారి తప్పి వచ్చి ఉంటుందిలే, తెల్లవారిన తర్వాత ఇచ్చేయవచ్చు అనుకున్నాడు సుందరం. పిల్లికూనని చూసేసరికి ఎక్కడలేని సంతోషం వచ్చింది నీతాకి. గబుక్కున ఎత్తుకుని ఒక తువ్వాలు తీసుకొచ్చి బాగా తుడిచి, పాలు బౌల్‌లో పోసి, ఆ పిల్లికూన తాగుతుంటే ఎంతో సంతోషంగా చూస్తోంది నీతా. ఈలోగా సుందరం, మూర్తి బట్టలు మార్చుకుని వచ్చారు.

"ఫ్లఫీ జూనియర్!" అంటూ ముద్దులు ప్రారంభించింది నీతా.

అదిచూసి ఫ్లఫీ జూనియర్‌ని ఇంట్లో ఉంచడానికి నిశ్చయించుకున్నాడు సుందరం. మళ్లీ సుందరానికి పిల్లి పనుల రొటీన్ తప్పలేదు. ■

## సంబంధం

పెళ్లిచూపుల్లో అబ్బాయితండ్రి, "మీ ఇంటిపేరేమిటండీ?" అని ప్రశ్నించాడు అమ్మాయితండ్రిని.

"చీమలకొండ." చెప్పాడు అమ్మాయితండ్రి.

"అయితే, మీతో మాకు సంబంధం కుదరదు లెండి...మాది బెల్లంకొండ!" అన్నాడు అబ్బాయితండ్రి.

-ఏ.వి.ఆర్., గుంతకల్లు